క్లుప్తంగా

టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక





అధ్యక్ష,కార్యదర్శులు రాజయ్య, మహేశ్

దుగ్గొండి: టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాంపల్లి రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా వేముల మహేశ్, ఉపాధ్యక్షులుగా శ్యాంప్రసాద్, అప్పాల నిర్మల, కోశాధికారిగా మేకల రాజు, కార్యదర్శులుగా రఘునాథం, నిజాముద్దీన్, అశోక్, సతీశ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సృజన్‌ప్రసాద్ వ్యవహరించారు.

విద్యార్థిని అదృశ్యం

నల్లబెల్లి: మండలంలోని లెంకాలపల్లిలో ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. లెంకాలపల్లి గ్రామానికి చెందిన నానబోయిన రాజయ్య కుమార్తె అశ్విని (21) బీఈడీ చదువుతోంది. నవంబర్ 30న కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రపోయింది. కుటుంబ సభ్యులు రాత్రి 10 గంటలకు లేచిచూడగా ఇంట్లో కనపడలేదు. దీంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అశ్విని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

గణిత ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతిగౌడ్



పర్వతగిరి: మండల కేంద్రానికి చెందిన బైరి తిరుపతిగౌడ్ తెలంగాణ గణిత ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా తిరుపతి గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



నల్లబెల్లి: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని శిక్షణ ఎస్సై రాజేశ్ అన్నారు. మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో డ్రగ్స్ వినియోగంతో జరిగే అనర్థాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లకు లోనుకాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు సైబర్ క్రైం పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవి కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ ఎస్సైగా ప్రశాంత్



గీసుకొండ: ఎస్సైగా టి. ప్రశాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లబెల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆయనకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు.

నియామకం

ఐనవోలు : అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గడ్డం రఘువంశీని నియమించినట్లు సమాఖ్య ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నియామకపత్రం అందించారు. రఘువంశీ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ సోమశేఖర్‌కు భారతసేవా రత్న అవార్డు



వర్ధన్నపేట: వర్ధన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విశిష్ట సేవలు అందించినందుకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ బుధవారం హనుమకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో డాక్టర్ సోమశేఖర్‌కు భారత రత్న సేవా నేషనల్ అవార్డు అందచేశారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కోవిడ్ సమయంలో పేద ప్రజలకు విశిష్ట సేవలు అందించారని గుర్తుచేశారు. సోమశేఖర్‌కు శాలువాతో ఘనంగా సన్మానించారు.

అధ్వానంగా జాతీయ రహదారి

- వర్షాలకు కోతకు గురైన కల్వర్టు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కంకరతేలి ఇరుకుగా ఉన్న జాతీయ రహదారి



కల్వర్టు కూరుకుపోవడంతో నిలిచిన మురుగునీరు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి మల్లంపల్లికి వెళ్లే 365 జాతీయ రహదారి అధ్వాన్నంగా మారింది. మల్లంపల్లి రోడ్డులోని దర్గా పక్కనే ఉన్న కల్వర్టు వర్షాల కారణంగా కోతకు గురైంది. దీంతో అధికారులు నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. క్రమక్రమంగా కల్వర్టుపై ఉన్న కంకరమట్టి జారి కాల్వలో పడడంతో మురుగునీరు నిలిచి ప్రమాదకరంగా ఉంది. దీంతో మురుగునీరు నిలిచి దుర్వాసన రావడంతో ప్రయాణికులు ముక్కులు మూసుకొని పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారి రాత్రి వేళలలో రోడ్డు కనిపించకపోవడంతో గుంతలో పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది. రోడ్డు ఇరుకుగా ఉండి పెద్ద పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ అంతరాయం కలుగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మధ్యకాలంలో ఒక లారీ కల్వర్టుపై మరమ్మతు కారణంగా ఆగిపోవడంతో గంటపాటు వాహనదారులు అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా రోడ్డు మరమ్మతులు చేసి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు



నర్సంపేట రూరల్ : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

నర్సంపేట/నర్సంపేట రూరల్ : పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో, మండలంలోని లక్నెపల్లి గ్రామశివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో హిందూ పవిత్ర గ్రంథమైన భగవద్గీత పుట్టిన రోజు (గీతా జయంతి) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు శ్రీకృష్ణుడు, అర్జునుడు, గోపిక వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భగవద్గీత శ్లోకాలు పాడి, గోదా కల్యాణం నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమానికి బాలాజీ విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ వనజ, టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ హాజరై మాట్లాడుతూ భగవద్గీత మన జీవితం, కర్తవ్యం, ఆధ్యాత్మికత గురించి తెలియజేస్తూ శాశ్వతమైన జ్ఞానాన్ని కలిగి ఉందని అన్నారు. విద్యార్థులకు నృత్యాల పోటీలు, చిత్రలేఖనం, భక్తి పాటలు అను అంశంపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బాలాజీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌రాజ్, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.జ్యోతి, అక్షరద స్కూల్ ప్రిన్సిపాల్ జి.భవాని, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



గీసుకొండ : పోటీలను నిర్వహిస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

గీసుకొండ: మండలంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో గీతాజయంతి సందర్భంగా బుధవారం భగవద్గీత శ్లోకాల పఠనంపై పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు వరంగల్ ఆధ్యాత్మిక సేవా సంస్థ వారు పోటీలు నిర్వహించారు. పోటీల్లో పొడాల మహాలక్ష్మి(మోడల్ స్కూల్) ప్రథమ స్థానంలో నిలువగా రూ. 516 నగదు బహుమతిని, బి. శ్రీకర్ (గీసుకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల)కు ద్వితీయ స్థానంలో నిలువగా రూ. 316, బి. కీర్తి(ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాల) తృతీయ స్థానంలో నిలువగా రూ. 216 నగదును అందించారు. అలాగే గీసుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.ప్రవస్‌కు స్పెషల్ బహుమతి కింద రూ. 216 నగదును ఇచ్చారు. ఇంటర్ స్థాయిలో కొనాయమాకుల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బి. మేఘనకు రూ. 516, బి.జానకికి రూ. 316, కె. భవానికి రూ. 216 నగదు బహుమతులను అందించినట్లు సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ల్యాద లింగమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్ షా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్



పర్వతగిరి : క్రీడాకారులతో ఎంఈఓ, కాంగ్రెస్ నాయకులు

పర్వతగిరి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల మోడల్ స్కూల్‌లో జరుగుతున్న సీఎం కప్ క్రీడలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో విద్యార్థులకు క్రీడా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సీఎం కప్‌కు ఎంపికైన క్రీడాకారులకు సన్మానం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ లింగారెడ్డి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఆయా స్కూళ్ల పీఈటీలు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, బండి సాయిలు, బొట్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : ప్రథమస్థానంలో నిలిచిన పెర్కవేడు జట్టు

సీఎంకప్‌లో ప్రతిభ కనబర్చిన పెర్కవేడు

రాయపర్తి : సీఎం కప్ పోటీల్లో మండలంలోని పెర్కవేడు గ్రామ జట్టు ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచినట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారిలో సందీప్, ఐత రాజు, రాసాల రాకేష్, దురిశెట్టి అఖిల్, బండి వంశీ, కొండ సాయిరాజ్, పరీదుల వంశీ, మంచాల రాకేష్, పరీదుల జస్వంత్, మంగులాల్‌లు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి



నెక్కొండ : ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలుకు తెలంగాణలోనే శ్రీకారం చుడుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్న మాట నిలుపుకోవాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా 11 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసిన మాదిగలకు ద్రోహం చేశారని ఆయన మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి ఎస్సీ కేటగిరి ఉద్యోగాల్ని మాలలకు దోచిపెడుతున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, వెంకన్న, చెన్నకేశవులు, ప్రభాకర్, పాల్గొన్నారు.

ఆత్మగౌరవ ప్రతిరూపమే తల్లి విగ్రహ రూపం



మాట్లాడుతున్న జక్కి శ్రీకాంత్

వర్ధన్నపేట : బహుజన కులాల మహిళల అస్తిత్వ ఆత్మగౌరవ ప్రతి రూపమే నేటి తెలంగాణ తల్లి విగ్రహ రూపమని జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు కవులకు, కళాకారులకు అరుదైన గౌరవంతో పురస్కారాలను అందిస్తూ తెలంగాణ రాష్ట్ర గీతాన్ని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఇలాంటి మహోన్నత కార్యక్రమాలు చేపడితే ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు బురదజల్లే ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. సామాన్య తల్లుల రూపంపై విషం కక్కడం దుర్మార్గమైన చర్య అన్నారు. పదేళ్లుగా గుర్తుకురాని తెలంగాణ తల్లి, సంస్కృతి ఇప్పుడు గుర్తుకొచ్చిందా అన్నారు. కార్యక్రమంలో నాయకులు జన్ను నర్సయ్య, కుమార్, అంజయ్య,చంద్రమౌళి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



నల్లబెల్లి: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని నాగరాజుపల్లి మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి అన్నారు. నాగరాజుపల్లి గ్రామశివారు పంతులుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తన సొంత డబ్బులతో విద్యార్థులకు షూస్ బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు.పాఠశాల అభివృద్ధి కోసం భవిష్యత్‌లో మరింతగా కృషి చేస్తామన్నారు. హెచ్‌ఎం రాంమూర్తి, ఏఏపీసీ చైర్మన్ వెంకటలక్ష్మి, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్, విష్ణు, పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ రాజు

పర్వతగిరి: మండలంలోని నారాయణపురంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన నిర్వహించారు. పశువైద్యాధికారి కె.రాజు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేవలం ఆడ దూడలు పుట్టే లింగనిర్ధారణ చేసిన సెక్స్ సార్టెడ్ సేమెన్ అందుబాటులో ఉందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 92 పశువులు రాగా 54 ఎదకు రాని పశువులకు, 32 దూడలకు నట్టల నివారణ మందులు, 8 గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ కె.రఘువీర్, డి.కుమారస్వామి, పి.వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా యాకూబ్



మండల కన్వీనర్‌గా యాకూబ్



పట్టణ అధ్యక్షుడిగా శంకర్

నెక్కొండ: ఎమ్మార్పీఎస్ మండల, పట్టణ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంఘం సమావేశానికి ఆయన హాజరై, కమిటీల నియామకం చేపట్టారు. మండల కమిటీ కన్వీనర్‌గా జంజాల యాకూబ్, గౌరవ అధ్యక్షుడిగా ఈదునూరి ప్రభాకర్, కో-కన్వీనర్లుగా ఈదునూరి వెంకన్న, గడ్డం రమేశ్, కొమ్ము కార్తీక్, డెక్క లక్ష్మణ్, గౌరవ సలహాదారులుగా బిర్రు సుదర్శన్, కొమ్మాలు, యాకయ్య, మంద ఉపేందర్‌ను ఎన్నుకున్నారు. అలాగే పట్టణ అధ్యక్షుడిగా కొలకనూరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా గ్యారె శ్యాం, ఉపాధ్యక్షుడిగా కందిక ముఖేశ్‌లు ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు. నూతన బాధ్యులు సంఘం అభివృద్ధికై పాటుపడాలని సూచించారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల



మాట్లాడుతున్న నామాల సత్యనారాయణ

నర్సంపేట: న్యాయంగా ఉండాల్సిన పోలీసులే అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం సరైంది కాదని, అక్రమ కేసులకు భయపడేది లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం జైలు నుంచి విడుదలైన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, 1వ వార్డు కౌన్సిలర్ దేవోజు సదానందం, మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కడారి రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి వెన్నుముద్దల శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్, పెండం వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు మద్దెల సాంబయ్య, పైసా ప్రదీప్, పెరుమాండ్ల రవి, కొమ్ముల కరుణాకర్‌లు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ మున్ముందు ప్రజల కోసం ప్రజాక్షేత్రంలో ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

- డీబీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఇమ్మడి బాబు

నర్సంపేట: పట్టణంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని డీబీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సంపేటలోని మాధన్నపేట రోడ్డుకు ఇరువైపులా సర్వే నంబర్ 111 భూములను రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్‌టీఆర్ నగర్‌లోని ప్రభుత్వ భూమిలో 2021లో డీబీఆర్పీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దళితులు 500 మంది గుడిసెలు వేసుకున్నారన్నారు. వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశా రు. రాపర్తి జగన్నాథం, ఎండీ. పాషా, యాకయ్య, వెంకన్న, సమ్మక్క, రాములు, నర్స య్య, నవీన్, పైడి, సుశీల, పుష్పమ్మ, తదితరులు పాల్గొన్నారు.

15న ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక



మాట్లాడుతున్న అనీస్ సిద్దిఖీ

నయీంనగర్: సియాసత్ యాజమాన్యం, మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ ఆధ్వర్యంలో ముస్లిం యువతీ, యువకులకు ఉచిత వివాహ పరిచయ వేదికను ఈనెల 15న వరంగల్ అబ్బాస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు ఫోరం కన్వీనర్ డాక్టర్ అనీస్ సిద్దిఖీ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్దిఖీ మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరు కావాలని సూచించారు. వివరాలకు 99087 63454 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ అక్బర్, నదీమ్ బేగ్, నస్రీన్, అజారుద్దీన్, నుస్రత్ జహాన్, ఆరిఫ్, పర్వీన్ బేగం, అయేషా బేగం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చెన్నారావుపేట : ఎల్లమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



వర్ధన్నపేట : బిక్కి అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని నంబర్‌వన్ కాలనీకి చెందిన పసునూరి ఎల్లమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతదేహంపై బీఆర్ఎస్ మండల నాయకులు కంది కృష్ణచైతన్య పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు నరేందర్, నాయకులు సాంబయ్య, నర్సింగరావు, సుదర్శన్, రాజేష్, రమేష్, నవీన్, సతీష్, అశోక్, సాగర్, ఉన్నారు.

డీసీ తండాలో..

వర్ధన్నపేట : వర్ధన్నపేట మునిసిపల్ పరిధిలోని డీసీ తండాకు చెందిన ఏఎంసీ డైరెక్టర్ ఆంగోతు నాను తల్లి బిక్కి(60) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందింది. పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేష్‌ఖన్నా, మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ బుధవారం బిక్కి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారివెంట కీమా నాయక్, బాష, రాజేష్, రాజేందర్, యాకూబ్ తదితరులు ఉన్నారు.

కనుల పండువగా పడిపూజ



నల్లబెల్లి: పడిపూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

నల్లబెల్లి : మండల కేంద్రంలో కన్నెస్వామి గుగ్గిళ్ల శ్రీనివాసాచారి బుధవారం ఏర్పాటు చేసిన పడి పూజ వైభవంగా నిర్వహించారు. గణపతి, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఉంచి సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ మాలధారులు, భక్తుల శరణు ఘోషతో మార్మోగింది. పడిపూజ కార్యక్రమాన్ని కోడూరి రాయసాబ్ గురుస్వామి నిర్వహించారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



నర్సంపేట : పూజలు నిర్వహిస్తున్న అన్నదాతలు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాతలు సహార, సహకార గ్రూప్ హైదరాబాద్, నెల్లూరు రమేశ్, సౌజన్య, తేజస్, అశ్వత్‌లు పాల్గొనగా ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సైఫా సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాంతఈశ్వరయ్య, శ్రీరాముల శంకరయ్య, చెంచారావు, రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.